అమలాపురం, జనవరి 8 :

సామాజిక అభివృద్ధికి ఓఎన్‌జీసి చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలక్టరు కార్తికేయ మిశ్రా అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో ఓఎన్‌జిసి సిఎస్ఆర్ నిధులు(సామాజిక అభివృద్ధి నిధులు) సుమారు 60 లక్షలతో నిర్మించిన మంచినీటి సరఫరా యంత్రాలు (ఎటిఎమ్ మిషన్లు)తో పాటు శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన బయో టాయిలెట్లను రాజోలు శాసనసభ్యులు గొల్లపల్లి సూర్యరావుతో కలిసి జిల్లా కలక్టరు ప్రారంభించారు. అలాగే 72 లక్షలతో అంతర్వేదిపాలెం నుండి వయా దండుపుంత మీదుగా లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి ఏర్పాటు చేసిన పైపులైన్లను కూడా కలక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ అంతర్వేదిలో దీర్ఘకాలంగా ఉన్న త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఈనాడు లభించిందని అని అన్నారు. ప్రతి సంవత్సరం ట్యాంకుల ద్వారా ప్రజలకు మంచినీటిని అందించేవారమని, ఇప్పుడు ఆ సమస్య తీరిపోయిందని కలక్టరు అన్నారు. ప్రభుత్వ పరంగా త్రాగునీటి సరఫరా కోసం నిధులు కేటాయించే క్రమంలో ఓఎన్‌జిసి సంస్థ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజల ఇబ్బందులను గ్రహించి త్రాగునీరు అందించేందుకు నడుం బిగించిందని సంస్థను అభినందించారు. ఓఎన్‌జిసి సంస్థ స్వచ్ఛ జలధార కార్యక్రమంలో భాగంగా ఎటిఎమ్ కార్డు ద్వారా ప్రతి ఆధార్‌కార్డు హోల్డర్ కుటుంబానికి రోజుకు 20 లీటర్ల శుద్ధి చేసిన త్రాగునీటిని అందించే కార్యక్రమానికి ముందుకు రావడం అభినందనీయమని, సమాజ సేవలో ఓఎన్‌జిసి సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని, అలాగే ఎవరిపైనా ఎటువంటి ఆర్థికపరమైన ఒత్తిడి లేకుండా ఓఎన్‌జిసి ఇటువంటి కార్యక్రమాలు అమలుచేయడం అభినందనీయమని కలక్టరు కొనియాడారు. మంచి మనస్తత్వం వున్న అధికారుల వల్ల ప్రజలకు సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని కలక్టరు అన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుమారు 20 లక్షల రూపాయలతో ఓఎన్‌జిసి బయో టాయిలెట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రగతిశీల భావాలతో రాజోలు శాసనసభ్యులు గొల్లపల్లి సూర్యారావు చేస్తున్న కృషి అభినందనీయమని, జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు రాబట్టడంలో రాజోలు శాసనసభ్యులు అగ్రభాగాన ఉన్నారని కలక్టరు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసే విజ్ఞప్తులకు ఓఎన్‌జిసి సంస్థ పూర్తి సహాయ సహకారాలు అందించాలని కలక్టరు సూచించారు. రాజోలు శాసనసభ్యులు గొల్లపల్లి సూర్యరావు మాట్లాడుతూ కోరిన వెంటనే నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఓఎన్‌జిసి సుమారు కోటి రూపాయల వరకు వెచ్చించిందని అందుకు సహకరించిన ఓఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డి.ఎమ్.ఆర్.శేఖర్‌కు శాసనసభ్యులు కృతజ్ఞతలు తెలియచేశారు. అంతర్వేది దేవస్థానానికి త్రాగునీటి సమస్య పరిష్కారం నిమిత్తం జిల్లా కలక్టరు 72 లక్షలు కేటాయించి నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించారని శాసనసభ్యులు అన్నారు. అధికారులు, ప్రతినిధులు సమిష్టి కృషి ఫలితమే నియోజకవర్గ అభివృద్ధికి దోహదం చేసిందన్నారు. సమాజ అభివృద్ధిలో ఓఎన్‌జిసి తరపున సేవలందిస్తున్న ఈడీ డి.ఎమ్.ఆర్.శేఖర్ గొప్ప మానవతావాది అని కొనియాడారు. ఓఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ శేఖర్ మాట్లాడుతూ అంతర్వేది పరిసర ప్రాంతాల్లో 60 లక్షలు సిఎస్ఆర్ నిధులతో వివిధ కార్యక్రమాలు ప్రస్తుతం చేపట్టామని ఇందులో 20 లక్షలతో దేవస్థానంలో ఒక వాటర్ ఎటిఎమ్, మరో 20 లక్షలతో అంతర్వేదికరలో మరో వాటర్ ఎటిఎమ్ ఏర్పాటు చేశామని అలాగే దేవస్థానంలో 20 లక్షలతో బయో టాయిలెట్లను నిర్మించామని ఈడీ అన్నారు. ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసిన వాటర్‌ఎటిఎమ్ కార్డు ద్వారా రోజుకు 20 లీటర్ల చొప్పున అంతర్వేదిలో 3500 కుటుంబాలకు, అలాగే అంతర్వేదికరలో మరో 3500 కుటుంబాలకు త్రాగునీరు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వాటర్‌ఎటిఎమ్ కార్డులను జిల్లా కలక్టరు ద్వారా ఆయా కుటుంబాలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో

(Contd-2)

బి.వెంకటరమణ, ఓఎన్‌జిసి సీనియర్ అధికారులు టి.కె.పాండే, హెడ్ ఇంజనీరు కె.ఎస్.ఆర్.రత్నం, హెచ్ఆర్ .ఇన్‌ఛార్జ్ ఎన్.ఆనంద్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్ జాతీయ అధ్యక్షులు వి.విజయపాల్, సెక్రటరీ డి.ప్రసాదరావు, రాజమండ్రి ఎస్సెట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధి ఎ.సత్యనారాయణ, పిఇయు ప్రధాన కార్యదర్శి డి.వి.కృష్ణంరాజు, సెక్రటరీ డి.సురేష్‌కుమార్ , ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రామ్‌నాయక్, రాజేష్, డబ్ల్యూడిఎఫ్ చైర్మన్ ఉషా, సఖినేటిపల్లి ఎంపిపి పప్పుల లక్ష్మీసరస్వతి, జడ్పీటీసి రావి అనేంద్రమణి, గోదావరి డెల్టా చైర్మన్ భూపతిరాజు సాయిబాబురాజు, దేవస్థానం ఇన్‌ఛార్జ్ సహాయ కమీషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ, ఎంపిడివో త్రిశూలపాణి, మండల తహశీల్దార్ సుధాకర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్వేదిపాలెంలో జన్మభూమి-మా వూరు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలక్టర్

అమలాపురం, జనవరి 8 :

సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో బుధవారం గ్రామీణ అభివృద్ధి, పారిశుద్ధ్యంపై చర్చ అంశాలతో ఏర్పాటు చేసిన జన్మభూమి-మా వూరు గ్రామసభలో జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలక్టరు మాట్లాడుతూ అత్యధిక నిధులతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను చేసి తూర్పు గోదావరి జిల్లా దేశంలోనే ప్రధమ స్థానంలో ఉందని జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా అన్నారు. గత సంవత్సరం 600 వందల కోట్లుతో జిల్లాలో సీసీ రహదారులు, ఇతర ఉపాధి పనులు చేయడం జరిగిందని కలక్టర్ అన్నారు. అలాగే 615 కిలోమీటర్ల మేర సీసీ రహదారులను జిల్లాలో వేసామని కలక్టర్ తెలిపారు. ఒక్క సంవత్సరంలో ఇంత పెద్ద ఎత్తున ఉపాధి పనులు చేసిన దాఖలా మునుపెన్నడు లేదని కలక్టర్ అన్నారు. ఈ సంవత్సరంలో 600 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు అదనంగా గ్రామీణ ప్రాంతాల్లో వేయడం జరిగిందని మిగిలిన రెండు నెలల్లోను అదనంగా వంద కిలోమీటర్ల మేర సీసీ రహదారులు వేస్తామని కలక్టర్ తెలిపారు. ఓడిఎఫ్ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి మరుగుదొడ్లు నిర్మించామని, వీటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. మొక్కల పెంపకం పారిశుద్ధ్యంలో రాష్ట్రంలో మనం మొదటి స్థానంలో ఉన్నామని అన్నారు. జిల్లాలో అన్ని పంచాయతీల్లోనూ పూర్తి స్థాయిలో ఎల్ఇడి లైట్లను ఏర్పాటు చేసి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని కలక్టరు తెలిపారు. అధికారులు అందరూ అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నారని ఇబ్బందులు ఉన్నచోట ప్రజలు సహకారం అందిస్తే అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామన్నారు. జన్మభూమి గ్రామసభల్లో పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు పంపిణీ పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని అంతర్వేదిపాలెంలో 1500 పెన్షన్లు ఇస్తున్నామని కలక్టరు తెలిపారు. అర్హత ఉన్నవారు పెన్షన్లకు ధరఖాస్తు చేసుకుంటే జనవరి, ఫిబ్రవరి మాసాంతానికి పెన్షన్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. గ్రామీణ పారిశుద్ధ్యం క్రింద సోక్‌ఫిట్లు ఏర్పాటు వంటి 116 పనులు చేయించవచ్చునని, ప్రజలు అడిగితే వీటిని చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. జన్మభూమి గ్రామసభల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాల్లో చంటిపిల్లలకు, గర్భవతులకు వైద్య పరీక్షలు తప్పక చేయించాలని కలక్టరు సూచించారు. రాజోలు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి త్రాగునీరు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా అందించేందుకు రాజోలు నియోజకవర్గానికి 102 కోట్ల రూపాయల మంచినీటి పథకం మంజూరు అయ్యిందని దీనిని ఆరు, ఏడు నెలల్లో పూర్తి చేయడం జరుగుతుందని కలక్టరు తెలియచేశారు. సఖినేటిపల్లిలో నిర్మాణంలో వున్న సమతా కన్వెన్షన్ సెంటర్(కళ్యాణ మండపం) ను కలక్టర్ పరిశీలించి ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. రాజోలు శాసనసభ్యులు గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలక్టరు, శాసనసభ్యులు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు, ఇళ్ల పట్టాలు, రేషన్‌కార్డులు, చంద్రన్న భీమా మొత్తాలను పంపిణీ చేశారు.